# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 26-04-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- మత్స్యకారుల అభివృద్ధికి ఎన్డీయే కూటమి ప్రభుత్వం తోడ్పాటు అందిస్తుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.
- రోజ్‌గార్ మేళా కార్యక్రమంలో భాగంగా ఈరోజు విశాఖపట్నంలో 278 మందికి కేంద్ర మంత్రి కె. రామ్మోహన్ నాయుడు నియామక పత్రాలను అందజేశారు.
- పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశాల కోసం నిర్వహించే పాలిసెట్ పరీక్ష ఈ నెల 30న జరగనుంది.
- ప్రధానమంత్రి నరేంద్రమోదీ “మన్ కీ బాత్ మనసులోని మాట” కార్యక్రమం 121వ సంచిక రేపు ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది.

=====================

మత్స్యకారుల అభివృద్ధికి ఎన్డీయే కూటమి ప్రభుత్వం తోడ్పాటు అందిస్తుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ‘మత్స్యకారుల సేవలో’ పేరుతో మత్స్యకార భరోసా పథకానికి ఈరోజు ఆయన శ్రీకారం చుట్టారు. ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 వరకు వేట విరామ సమయానికి సంబంధించి భృతి కింద ఒక్కో కుటుంబానికి ఇచ్చే మొత్తాన్ని 10 వేల రూపాయల నుంచి 20 వేల రూపాయలకు పెంచి మొత్తం 259 కోట్ల రూపాయలను లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. ఈ సందర్భంగా శ్రీకాకుళం జిల్లా ఎచ్చర్ల నియోజకవర్గం బుడగట్లపాలెంలో నిర్వహించిన ప్రజా వేదిక కార్యక్రమంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ..

(వాయిస్ 32 సెకన్లు)

రాష్ట్రంలోని మొత్తం 26 జిల్లాల్లో తక్కువ తలసరి ఆదాయం శ్రీకాకుళం జిల్లా దేనని.. ప్రజల ఆదాయం పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల జీవనప్రమాణాలను మెరుగుపరచాలని, అందుకు వెనుకబడిన వర్గాల కోసం మరిన్ని కార్యక్రమాలను భవిష్యత్ లో చేపడతామని ముఖ్యమంత్రి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహననయుడు మాట్లాడుతూ...

(వాయిస్ 32 సెకన్లు)

=====================

రోజ్‌గార్ మేళా కార్యక్రమంలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు వివిధ ప్రభుత్వ రంగ సంస్థలలో కొత్తగా నియమితులైన 51 వేల మందికి పైగా యువతకు దృశ్య మాధ్యమ విధానంలో నియామక పత్రాలను పంపిణీ చేశారు. దేశంలోని మొత్తం ఈరోజు 47 పేర్వేరు ప్రాంతాలలో 15వ రోజ్‌గార్ మేళాను నిర్వహించారు. మొత్తం 51 వేల 236 మంది కొత్తగా నియామకం పొందగా, విశాఖపట్నంలో 278 మంది అభ్యర్థులకు పౌర విమానయాన మంత్రి కె. రామ్మోహన్ నాయుడు నియామక పత్రాలను అందజేశారు. అనంతరం కేంద్రమంత్రి మాట్లాడుతూ... ఉద్యోగాలను సాధించే ప్రక్రియలో యువత ఎన్నో ఆనందాలను త్యాగం చేస్తారని.. అయితే ప్రభుత్వ సేవలో పెద్ద లక్ష్యాలను సాధించడానికి అదే ఉత్సాహంతో పని చేయాలని వారిని కోరారు. దేశ నిర్మానానికి తోడ్పడాలని కొత్తగా నియామకాలు తీసుకున్న వారికి కేంద్ర మంత్రి ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

=====================

తిరుపతి జిల్లా చిన్నగొట్టిగల్లు మండలం దాసరిగూడెం గ్రామానికి చెందిన ఆర్.సిద్ధయ్య అనే వ్యక్తి ఏనుగుల దాడిలో మృతి చెందడంతో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ సంతాపం తెలిపారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ క్లిష్ట సమయంలో ఆ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున 10 లక్షల రూపాయల పరిహారం ఇవ్వనున్నామని ప్రకటించారు. ఏనుగుల సంచారాన్ని, వాటి కదలికలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ... సమీప గ్రామ ప్రజలకు సమాచారాన్ని అందించేందుకు అన్ని రకాల చర్యలు చేపట్టామని అన్నారు. భవిష్యత్‌లో ప్రజలకు వన్యప్రాణుల నుంచి ఎలాంటి ప్రమాదాలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు పవన్ కల్యాణ్ ఆదేశాలు జారీ చేశారు. మరో వైపు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అవిడి గ్రామం వద్ద ఈ రోజు చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో 9 మంది మహిళా ఉపాధి హామీ శ్రామికులు గాయాల పాలైన ఘటన తెలిసి ఆవేదన చెందానని ఉప ముఖ్యమంత్రి సామాజిక మాధ్యమంలో తెలిపారు. తక్షణమే వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు.

విరామం

=====================

రాష్ట్ర రాజధాని అమరావతిలో అన్ని సదుపాయాలను కల్పిస్తున్నామని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. నెల్లూరు నగరంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ఈరోజు ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి  పాత్రికేయులతో మాట్లాడుతూ... 64 వేల కోట్ల రూపాయలతో రాజధాని నిర్మాణ పనులను చేపడుతున్నామని... 3 సంవత్సరాలలో రాజధాని పనులను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. వచ్చే 50 సంవత్సరాలను దృష్టిలో పెట్టుకుని.. అంతర్జాతీయ విమానాశ్రయం, స్పోర్ట్స్ సిటీని ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిర్ణయించారని మంత్రి నారాయణ వివరిస్తూ...

(వాయిస్ 32 సెకన్లు)

=====================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్ మనసులోని మాట” కార్యక్రమం 121వ సంచిక రేపు ప్రసారమవుతుంది. ఈ కార్యక్రమం రేపు ఉదయం 11 గంటలకు అన్ని ఆకాశవాణి, దూరదర్శన్ కేంద్రాల ద్వారా ప్రసారం కానుంది. మన్ కీ బాత్ కార్యక్రమం తెలుగు అనువాదం ప్రధానమంత్రి ప్రసంగం అయిన వెంటనే  ఒకసారి, తిరిగి రాత్రి 8 గంటలకు మరోసారి ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని అన్ని ఆకాశవాణి కేంద్రాల ద్వారా ప్రసారమవుతుంది.

=====================

ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాలు ఈరోజు ప్రారంభమయ్యాయి. ఈరోజు తో 99 సంవత్సరాలు పూర్తి చేసుకుని ఆంధ్ర విశ్వకలాపరిషత్ 100వ సంవత్సరంలోకి అడుగు పెడుతోంది. దేశంలో వందేళ్ల చరిత్ర కలిగిన అతి కొద్ది వర్సిటీల జాబితాలో చేరింది. పేద, మధ్య తరగతి విద్యార్థులెందరికో మెరుగైన విద్య అందించి ప్రపంచ వ్యాప్తంగా కీర్తి ప్రతిష్ఠలు సంపాదించుకుంది. దేశ, విదేశాల్లో ఎన్నో కీలక విభాగాల్లో ఏయూ పూర్వ విద్యార్థులు విధులు నిర్వర్తిస్తున్నారు.

======================

రాష్ట్రంలోని పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశాల కోసం నిర్వహించే పాలిసెట్ పరీక్ష ఈ నెల 30న జరగనుందని అల్లూరి సీతారామమరాజు జిల్లా కో-ఆర్డినేటర్ కే.సుజాత ఈరోజు ఒక  ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిధిలోని మొత్తం 11 పరీక్షా కేంద్రాలలో 2 వేల 435 మంది విద్యార్థులు పరిక్ష రాయనున్నారని వెల్లడించారు. విద్యార్థులు 30వ తేదీన ఉదయం 10 గంటలకు తమ పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలన్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష జరుగుతుందన్నారు. నిమిషం ఆలస్యం అయిన పరీక్షకు అనుమతించరని ఆమె స్పష్టం చేశారు.

======================

రాష్ట్ర ప్రభుత్వం స్పౌజ్ కేటగిరీ కింద కొత్తగా మంజూరు చేసే పింఛన్లకు అర్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని ఏలూరు పార్లమెంట్ సభ్యులు పుట్టా మహేష్ కుమార్ ఈరోజు ఒక ప్రకటనలో తెలిపారు. స్పౌజ్ కేటగిరీ కింద రాష్ట్రంలో కొత్తగా 89 వేల 788 మందికి పింఛన్లు మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఎన్టీఆర్ భరోసా పథకం ద్వారా పింఛన్ పొందుతున్న భర్త చనిపోతే భార్యకు తదుపరి నెల నుంచే పింఛన్ అందించేలా ఈ కేటగిరీని ప్రవేశపెట్టామని తెలిపారు. అర్హులైన మహిళలు భర్త మరణ ధ్రువీకరణ పత్రంతో పాటు తమ ఆధార్ కార్డు వివరాలను సమీపంలోని గ్రామ, వార్డు సచివాలయాల్లో అందించాలని ఎంపీ సూచించారు. ఈ నెల 25 నుంచి 30 వ తేదీ లోపు వివరాలతో కూడిన దరఖాస్తును సమర్పిస్తే మే ఒకటవ తేదీన పింఛను పొందవచ్చని ఎంపీ తెలిపారు.

======================

ఉపాధి వేతనదారులకు దినసరి వేతనం పెరిగేలా పనులు చేయించాలని విజయనగరం జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అధికారులను ఆదేశించారు. ఈరోజు కలెక్టరేట్ ఆడిటోరియంలో ఉపాధి పనుల తీరు, వేతనదారులు అందుకుంటున్న సగటు వేతనంపై సమీక్షించారు.

======================
======================